క్లుప్తంగా

పంచాయతీ కార్యదర్శికి ఘన వీడ్కోలు



కార్యదర్శిని సన్మానిస్తున్న గ్రామస్తులు

యాలాల: మండలంలోని బెన్నూరు పంచాయతీ కార్యదర్శి తారకచారి బదిలీ కావడంతో బుధవారం గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఆరేళ్లుగా గ్రామ కార్యదర్శిగా విధులు నిర్వహించిన ఆయన గ్రామాభివృద్ధికి పాటు పడ్డాడని పలువురు పేర్కొన్నారు. బెన్నూరు నుంచి లక్ష్మీనారాయణపూర్‌కు బదిలీపై వెళ్తున్న తారకచారి అక్కడ కూడా మంచి సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు పటేల్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ లక్ష్మప్ప, నాయకులు శరణుభూపాల్, కై లా రాఘవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో కేంద్ర పథకాలను వివరించాలి



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు శివరాజ్

యాలాల: కేంద్రంలోని బీజేపీ సర్కార్ చేపడుతున్న సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో గ్రామ గ్రామాన తీసుకెళ్లాలని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శివరాజ్, యాలాల మాజీ ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో పార్టీ క్రియాశీలక సభ్యుల సన్నాహక సమావేశాన్ని మండల అధ్యక్షుడు ఆకుల శివకుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..మండలంలోని ప్రతీ గ్రామంలో సమస్యలు తెలుసుకుని పార్టీ తరఫున పని చేయాలన్నారు. బూత్ స్థాయిలో బీజేపీ కార్యకర్తలు కష్టపడితేనే ప్రభుత్వానికి అనుకూల ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి రామ్యానాయక్, నాయకులు నారాయణరెడ్డి, రమేష్‌గౌడ్, శంకర్‌రెడ్డి, వెంకటేష్, రాజేందర్‌రెడ్డి, బాజారప్ప, బూరెప్ప పాల్గొన్నారు.

సకాలంలో యూనిఫాంలు అందజేయాలి

తహసీల్దార్ అంజయ్య, ఎంఈఓ రమేశ్



సిబ్బందికి క్లాత్ అందిస్తున్న తహసీల్దార్ అంజయ్య, ఎంఈఓ రమేశ్

యాలాల: నూతన విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి ప్రభుత్వ పాఠశాలలకు కొత్త యూనిఫాంలు అందించేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ అంజయ్య, మండల విద్యాధికారి రమేశ్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో యూనిఫాంలకు సంబంధించిన బట్టను ఐకేపీ సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..మండలంలోని 60 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలతో పాటు కేజీబీవీ పాఠశాల ఉందన్నారు. వీటిలో దాదాపు 5,400 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని, వీరందరికి ప్రభుత్వం తరఫునా యూనిఫాంలు అందిస్తున్నట్లు తెలిపారు. సకాలంలో యూనిఫాంలు కుట్టే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం ప్రమీళ, ఎంఐఎస్ కోఆర్డినేటర్ సర్వర్, సీఆర్పీ శ్రీనివాస్, ఆపరేటర్ వెంకటేష్, ఐకేపీ సిబ్బంది రాజేశ్వరి, చిరంజీవి, షఫీ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత

ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

దోమ: రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం దోమ మండల కేంద్రంతో పాటు గుండాల, కొత్తపల్లి, దాదాపూర్ గ్రామాలలో పర్యాటించి జైభీమ్, జై బాపు, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా అంబేడ్కర్ చిత్రపటాలతో కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..భారతదేశం చాలా క్లిష్టపరిస్థితుల్లో ఉందని, ఎన్నో త్యాగాలు చేసి నిర్మించుకున్న ఈ దేశంలో భారత రాజ్యాంగాన్ని, మహనీయుల గొప్పతనాన్ని కనుమరుగు చేసే కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. దేశంలో జరుగుతున్న వాస్తవాలు ప్రజలకు తెలియజేసేందుకు జైభీమ్, జై బాపు, జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. అనంతరం ఐనాపూర్, గుండాల, కొత్తపల్లి గ్రామాలలోని రేషన్ దుకాణంలో లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు మొగులయ్యగౌడ్, రమేష్‌గౌడ్, పాల్గొన్నారు.

కదలని ఇందిరమ్మ

నెలలు గడుస్తున్నా సొంతింటి కల నేరవేరడం లేదు. అందు కోసం జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల పథకం ముందుకు సాగడం లేదు. సకాలంలో లబ్ధిదారులను ఎంపిక చేయకపోవడంతో నిర్మాణాలు కార్యరూపం దాల్చడం లేదు. పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన గ్రామాల్లో పనులు మచ్చుకైనా కనిపించడం లేదు. పలు చోట్ల లబ్ధిదారులు అప్పు చేసి పనులు చేపట్టినా బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నారు.

- జిల్లాలో నత్తనడకన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం
- పునాది స్థాయి దాటని వైనం
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందుల్లో లబ్ధిదారులు



అవుసుపల్లిలో లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ నర్సింహులు

ఉన్న ఇల్లు కూల్చి..

తాండూరు రూరల్: చెన్‌గేస్‌పూర్ గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారు. 144 ఇందిరమ్మ ఇళ్లకు మంజూరు పత్రాలు కూడా లబ్ధిదారులకు అందజేశారు. కానీ కేవలం నాలుగు ఇళ్లు మాత్రమే ప్రొగ్రెస్‌లో ఉన్నాయి. శిథిలావస్థకు చేరిన ఇళ్లు కూల్చివేసి పునాది వరకు నిర్మించుకున్నారు. ఇప్పటి వరకు చిల్లిగవ్వ కూడా ఇవ్వలేదు. దీంతో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు అయోమయంలో పడ్డారు. అధికారులు మాత్రం బిల్లులు వస్తాయని చెబుతున్నప్పటికీ లబ్ధిదారులకు మాత్రం నమ్మకం కలగడం లేదు. మిగత 140 మంది లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునేందుకు వెనుకడుగు వేస్తున్నారు.

6,300 ఇళ్లు మంజూరు

ధారూరు: మండలంలోని 34 గ్రామ పంచాయతీల్లో అర్హులైన 6,300 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. ఇంతవరకు ఏ ఒక్క గ్రామం, తండాలో కూడా ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. మండలంలోని అవుసుపల్లి గ్రామాన్ని మాత్రం పైలెట్ ప్రాజెక్టు కింద తీసుకుని 147 ఇళ్లు మంజూరు చేశారు.

మోడల్ విలేజ్‌లోనే మార్కింగ్



పునాది కోసం గుంతను పరిశీలిస్తున్న నర్సింహులు

ధారూరులో ఎక్కడా కూడా ఇళ్ల నిర్మాణం ప్రారంభం కాలేదు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావాల్సి ఉంది. పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన అవుసుపల్లిలో మాత్రం 20 ఇళ్ల నిర్మాణానికి మార్కింగ్ ఇచ్చాం. వీరిలో 8 మంది బేస్‌మెట్ పనులు చేయగా, ఒకరు మాత్రం గోడలు వరకు పనులు చేపట్టారు. బుధవారం హౌజింగ్ డీఈ సయ్యద్ సాజిద్ అలీ, గ్రామ కార్యదర్శి తిరుపతి, ఏఈలతో కలిసి గ్రామంలో లబ్ధిదారులకు అవగాహన కల్పించాం. చాలమంది ఇళ్ల నిర్మాణానికి అంతగా ఆసక్తి చూపడం లేదు.



కుర్వ మమత

ఈ ఫొటోలో కనిపిస్తున్న లబ్ధిదారు పేరు కుర్వ మమత, భర్త నర్సింలు, ముగ్గురు పిల్లలు ఉన్నారు. వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తోంది. రెండు నెలల క్రితం ఇందిరమ్మ ఇళ్లు మంజూరైంది. దరఖాస్తు సమయంలో పాత ఇంటి వద్ద ఫొటో దిగింది. అధికారులు మాత్రం పాత ఇళ్లు కూల్చి అదే స్థలంలో నిర్మాణం చేపడితే బిల్లులు మంజూరవుతాయని చెప్పారు. దీంతో ఇంటి నిర్మాణం కోసం ఇళ్లు కూల్చి..గ్రామంలో అద్దె గదిలో ఉంటోంది. అప్పట్లో అధికారులు మాత్రం మీరు ఎంతైన ఇళ్లు నిర్మించుకోవచ్చు. కానీ ప్రభుత్వం మాత్రం రూ.5 లక్షలు వరకూ మంజూరు చేస్తాందని చెప్పారు. ప్రభుత్వం ఇచ్చే సహాయంతో పాటు కొంత అప్పు చేసి ఇళ్లు పెద్దదిగా నిర్మించుకోవచ్చనే ధీమాతో ఇంటి నిర్మాణం ప్రారంభించింది. ఇందుకు మమత బంగారం తాకట్టు పెట్టి రూ.లక్ష, డ్వాక్రా సంఘంలో రూ.2 లక్షల రుణం తీసుకొని ఇంటి నిర్మాణం ప్రారంభించింది. బేస్‌మెట్ బిల్లు రూ.లక్ష రావాల్సి ఉంది. కానీ ఇప్పటి వరకు ఆమెకు బిల్లు రాలేదు. 400 స్కోయర్‌ఫీట్‌లో ఇంటి నిర్మాణం చేపడితేనే బిల్లు వస్తుందని చెబుతున్నారు. మొదట ఎంతైనా నిర్మించుకోవచ్చని చెప్పిన అధికారులు ఇప్పుడు లెక్కలు చెప్పడంతో ఆమె ఆందోళన చెందుతుంది. అధికారులు మొదట చెప్పడంతోనే ఉన్న ఇళ్లను కూల్చి ఇందిరమ్మ ఇంటి నిర్మాణం చేపట్టానని, అధికారుల నిబంధనలతో ఆమె నివ్వెరపోతుంది. ఉన్నతాధికారులు స్పందించి బేస్‌మెట్ బిల్లు ఇప్పించాలి.

నత్తనడకన పనులు



నాగవరంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి వేసిన ముగ్గు

బంట్వారం: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు బంట్వారం, కోట్‌పల్లి మండలాల్లోని మోడల్ గ్రామాల్లో నత్తనడకన కొనసాగుతున్నాయి. మోడల్ గ్రామాల కింద ఎంపికైన నాగవరం, కంకణాలపల్లి గ్రామ పంచాయతీల్లో జనవరి 26న లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు ప్రతాలను అధికారులు అందజేశారు. నాగవరం గ్రామానికి 61 ఇళ్లు, కంకణాలపల్లి పంచాయతీకి 76 మంజూరయ్యాయి. రెండు నెలలు గడుస్తున్నా ఇండ్ల నిర్మాణంలో మాత్రం ఎలాంటి పురోగతి లేదు. ఇప్పటి వరకు నాగవరంలో 5, కంకణాలపల్లిలో ముగ్గురు లబ్ధిదారులు ఇంటి నిర్మాణానికి మార్కింగ్ చేసి ముగ్గు వేశారు.

బాల్‌రెడ్డిగూడెంకు 36 ఇండ్లు..

మోమిన్‌పేట: బాల్‌రెడ్డిగూడెం ప్రత్యేక గ్రామానికి 36 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయి. మిగత గ్రామాల్లో ఇప్పటి వరకు ఎంపిక చేయలేదు. ఎల్1లో 2,708మంది లబ్ధిదారులను ఎంపిక చేయగా ఇంక అందులో నుంచి కొంత మందిని తీసివేసేందుకు కసరత్తు చేస్తున్నారు.

మూడు నెలలుగా ఎదురుచూపులు



కోష్లే దుర్గయ్య.

ఇందిరమ్మ ఇంటి మంజూరు నకు మూడు నెలలుగా ఎదురు చూస్తున్నా. ఎల్1లో నా పేరు ఉంది. వేసవి కాలంలో మంజూరు చేస్తేనే నిర్మించుకునేందుకు ఇబ్బందులు ఉండవు. వర్షకాలంలో నిర్మించుకొనేందుకు చాలా ఇబ్బందులు పడాల్సి ఉంటుంది.

– కోష్లే దుర్గయ్య, ఎన్కేపల్లి

ఎల్1 జాబితాలో పేరు



మండల పరిధిలోని 28గ్రామ పంచాయితీల్లో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు 2,708మంది ఎల్1లో ఉన్నారు. ఇంక అందులోనుంచి అనర్హులను గుర్తిస్తున్నాం. కలెక్టర్ లాగిన్‌లోకి అర్హుల జాబితాను పంపిస్తున్నాం. ప్రత్యేక గ్రామంలో 36మంది లబ్ధిదారులను గుర్తించి మంజూరు చేయగా ఇద్దరు మాత్రమే బెస్‌మెంటు లెవల్ వేశారు.

– విజయలక్ష్మి, ఎంపీడీఓ మోమిన్‌పేట

డబ్బు లేక.. పనులు సాగక



కాశీంపూర్‌లో వేసిన ఇంటి పునాది



సమావేశమైన ఇందిరమ్మ కమిటీ

బషీరాబాద్: మండలంలో కాశీంపూర్ గ్రామాన్ని అధికారులు పైలెట్ గ్రామంగా ఎంపికచేశారు. ఈ గ్రామంతో పాటు అనుబంధ గ్రామం మల్కన్‌గిరితో కలిపి 193 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. లబ్ధిదారులకు అధికారులు మంజూరు పత్రాలు కూడా అందజేశారు. అయితే ఇంటి నిర్మాణానికి మాత్రం ఆసక్తి చూపించడం లేదు. అధికారులు ఎంత ప్రోత్సహించినా కట్టుకోవడానికి డబ్బులు లేవని చెబుతున్నారు. ఇప్పటి వరకు రెండు గ్రామాల్లో కలిపి రెండు ఇళ్లకు మాత్రమే పునాది రాళ్లు పడ్డాయి.

ఆసక్తి చూపని లబ్ధిదారులు



లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్లు కట్టుకోవడానికి ముందుకు రావడంలేదు. రెండు రోజుల క్రితం ఇందిరమ్మ కమిటీ సమావేశం ఏర్పాటు చేసి చర్చించాం. నిర్మాణాల వెనుకబాటుకు గల కారణాలు తెలుసుకుంటే ప్రతిఒక్కరూ డబ్బులు లేవనే వివరిస్తున్నారు. వారిని చైతన్యం చేసి నిర్మాణాలు ప్రారంభిస్తాం. కమిటీలోని సభ్యులకు ఒక్కొక్కరు కనీసం ముప్పై మంది లబ్ధిదారులతో ఇందిరమ్మ ఇళ్లను ప్రాంభించేల వారి జాబితాను అందజేశాం. త్వరలో 50శాతం ఇళ్లు ప్రారంభించేల చర్యలు తీసుకుంటాం.

– అశోక్, కార్యదర్శి, కాశీంపూర్

నత్తనడకన పథకం



బేస్‌మెంట్ లెవల్‌లో నిర్మాణం

నందారం గ్రామంలో 27 నిర్మాణాలకు 5 మాత్రమే ప్రారంభం దౌల్తాబాద్: నందారం గ్రామంలో మొదటి విడతగా 27 మంది లబ్ధిదారులను గుర్తించి హౌసింగ్ అధికరులు మార్కింగ్ ఇచ్చారు. ఇందులో 5 మంది మాత్రమే నిర్మాణాలు ప్రారంభించారు. మిగిలిన 22 మంది ప్రారంభించలేదు. ప్రస్తుతం వ్యవసాయ పనుల్లో బిజీగా ఉండడం, కొంతమంది లబ్ధిదారులకు డబ్బులు లేకపోవడంతో ప్రారంభించలేదు. ఇళ్ల నిర్మాణానికి ముగ్గు పోసి నెలలు గడుస్తున్నా ఇంకా 22మంది లబ్ధిదారులు పనులు మొదలు పెట్టలేదు.

బేస్‌మెంట్ నిర్మించా..



సాయమ్మ

నాపేరు సాయమ్మ. ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. అధికారులు మంజూరు పత్రం ఇచ్చారు. అయితే ప్రస్తుతం బేస్‌మెంట్ వరకు నిర్మించాను. అధికారులు కూడా ఇల్లు నిర్మాణాన్ని పరిశీలించారు. ఇల్లు నిర్మాణానికి త్వరలో బిల్లు మంజూరు చేస్తే బాగుంటుంది. గ్రామంలో వ్యవసాయ పనులు సాగుతున్నాయి.

– సాయమ్మ, నందారం

అర్హులకు కేటాయించాలి



శివారెడ్డిపల్లి తండాలో బేస్మెంట్ లెవల్ ఇంటి నిర్మాణం

దోమ: దోమ మండలంలో మొత్తం 36 గ్రామ పంచాయతీ ఉండగా అందులో కేవలం శివారెడ్డిపల్లి గ్రామ పంచాయతీకి మాత్రమే 185 ఇండ్లను అధికారులు కేటాయించారు. మిగత గ్రామాలకు కేటాయించకపోవడంతో ఇందిరమ్మ ఇళ్లు తమకు ఎప్పుడు కేటాయిస్తారోనని లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు. కనీసం అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ఇళ్లు లేని పేదలకు ఇంటిని కేటాయించాలని కోరుతున్నారు. శివారెడ్డిపల్లి, శివారెడ్డిపల్లి తండాకు కేటాయించిన ఇండ్లలో ఇప్పటికి రెండిటిని మాత్రమే అధికారులు పనులు ప్రారంభించారు. అవి కూడా బేస్మెట్ స్థాయిలో పనులు జరుగుతున్నాయి. మిగత వాటిని నేటికి ప్రారంభించకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

పనులు జరుగుతున్నాయి



ఎమ్మెల్యే సహకారంతో తమ గ్రామానికి 185 ఇళ్లు మంజూరయ్యాయి. అందులో కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించారు. ప్రస్తుతం బేస్మెట్ లెవల్ పనులు జరుగుతున్నాయి. ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

– మెగ్యానాయక్, శివారెడ్డిపల్లి తండా

14 ఇళ్లకు గాను..



అనంతగిరి: పెండ్లిమడుగులో పిల్లర్ల దశలో నిర్మాణం

అనంతగిరి: వికారాబాద్ మండలంలోని పెండ్లిమడుగు ఒకే గ్రామాన్ని ఎంచుకుని అధికారులు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశారు. గ్రామంలో మొత్తం 14 ఇండ్లు మంజూరు చేయగా వాటిలో ప్రస్తుతం 6 ఇండ్లు ప్రారంభించారు. వీటిలో ఒక ఇల్లు పిల్లర్ల స్థాయిలో ఉండగా, మూడు గుంతలు తీస్తుండగా, రెండింటికి బుధవారం ముగ్గు వేసి ప్రారంభించారు.

ప్రారంభ దశలోనే..



పారంభ దశలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లు

కుల్కచర్ల: కుల్కచర్ల మండలంలోని అనంతసాగర్ గ్రామంలో 119మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారు. ప్రస్తుతం 13మంది ఇళ్ల నిర్మాణా పనులు ప్రారంభించారు. చౌడాపూర్ మండలంలో మక్తవెంకటాపూర్ గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా తీసుకున్నారు. ఈ గ్రామంలో 113మందికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశారు.

లబ్ధిదారుల ఊసేలేదు

దుద్యాల్: ఇదిగో ఇందిరమ్మ ఇళ్లు..అదిగో ఇళ్లు.. అంటూ ప్రభుత్వం ప్రజలను మభ్యపెడుతూ మాట దాటవేస్తుందే తప్ప లబ్ధిదారులను నేటికి ఎంపిక చేయలేదు. మండలంలో 21 గ్రామ పంచాయతీలు కలవు. సంగాయిపల్లి గ్రామంలో రెండు నెలల క్రితం ప్రజాపాలన పథకాల అమలు సభ నిర్వహించి అధికారులు అదే రోజున ఆ ఒక్కో గ్రామానికి 62 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. మిగత గ్రామాల్లో మాత్రం నేటికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ఊసేలేదు.

రేకుల గదిలో ఉంటున్నా..



నా పేరు తొందూరి అనసూయ. భర్త చనిపోవడంతో కూలీ పనులు చేస్తూ ముగ్గురు పిల్లలను చూసుకుంటున్నాను. ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకుని నెలలు గడిచాయి. పలు మార్లు అధికారులను అడిగినా ప్రయోజనం లేదు. లబ్ధిదారుల ఎంపిక కాలేదని చెబుతున్నారు. పిల్లలు ఇంటికి వచ్చినప్పుడు ఇరుకు గదిలో ఉండలేక పోతున్నాం. అప్పుడప్పుడు బంధువుల ఇళ్లలో నిద్రించాల్సివస్తుంది. ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తే బాగుంటుంది. ఎప్పుడు ఇస్తుందోనని వేయి కళ్లతో ఎదురుచూస్తున్నాను.

– అనసూయ, దుద్యాల్

ఒక్క ఇంటికీ ముగ్గు వెయ్యలేదు..

పరిగి: ఇందిరమ్మ నిర్మాణం కోసం పైలెట్ ప్రాజెక్టు క్రింద మండలానికి ఒక గ్రామాన్ని ప్రభుత్వం ఎంపిక చేసింది. సుల్తాన్‌పూర్ గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్ట్ క్రింద ఎంపిక చేసి స్థానిక ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. మొత్తం 197 మందిని అర్హులుగా ఎంపిక చేశారు. అందులో 107 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. ప్రారంభించి నెల రోజులు పూర్తవుతున్నా ఇప్పటి వరకు ఒక్కరు కూడా పునాదికి ముగ్గు వెయ్యలేదు.

240 మందికి మంజూరు



బేస్‌మెంట్ పూర్తయిన ఇల్లు

పూడూరు: ఆరుగ్యారెంటీల్లో భాగంగా నియోజకవర్గంలోని ప్రతీ మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసింది. అందులో పూడూరు మండల పరిధిలోని ఎన్కేపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు చేస్తుంది. ముందుగా రుణమాఫీ, రైతు భరోసా పథకాలతో పాటు 240 మందికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసింది. 15 మంది లబ్ధిదారుల ఇళ్లకు మార్కింగ్ ఇచ్చారు. 6 ఇళ్లు బేస్‌మెట్ లెవల్ పూర్తయ్యాయి. ఎంబీ రికార్డు చేసి బిల్లుల కోసం ప్రభుత్వానికి పంపించారు. నాలుగు విడతల్లో ఇందిరమ్మ ఇంటికి రూ. 5లక్షలు ప్రభుత్వం అందిస్తుంది. బేస్‌మెట్ లెవల్‌లో రూ. లక్ష, స్లాబ్ లెవల్‌లో గోడలు పూర్తయితే లక్ష, స్లాబ్ వేసిన తర్వాత 2లక్షలు, ఇంటి నిర్మాణం పూర్తయిన తర్వాత ఫైనల్ బిల్లు అందిస్తామని హౌసింగ్ డీఈఈ ముక్రం తెలిపారు.

సీఎం సహాయ నిధి పేదలకు వరం



చెక్కులు పంపిణీ చేసిన లబ్ధిదారులతో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు: సీఎం సహాయ నిధి పేదలకు వరమని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. తాండూరు నియోజకవర్గంలో ఎవరైనా అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరితే మెరుగైన వైద్యం కోసం సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకుంటే తక్షణమే మంజూరు చేయించి ఎల్‌ఓసీలు అందజేస్తామన్నారు. బుధవారం తాండూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన 169 మంది లబ్ధిదారులకు రూ.70.20 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

కుల్కచర్ల: బడుగుబలహీనవర్గాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని కుల్కచర్ల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రామ్మోహన్ శర్మ అన్నారు. మరికల్ గ్రామంలో గ్రామానికి చెందిన ఉస్మాన్‌సేన్ అనారోగ్యంతో ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స అనంతరం బుధవారం ఆయనకు మంజూరైన సీఎం సహాయనిధి రూ. 21 వేల చెక్కును అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పేద ప్రజలు అనారోగ్య సమస్యలతో ఇబ్బందులకు గురవుతున్న నేపథ్యంలో వారికి అండగా ఉండాలన్న సంకల్పంతో సీఎం సహాయనిధి ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు నర్సింహా రెడ్డి, దామోదర్ రెడ్డి, నర్సింలు, ఎండీ. సర్వర్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి

సమస్యల పరిష్కారానికి కృషి

తాండూరు: మున్సిపాలిటీల్లో నెల కొన్న సమస్యలను పరిష్కరించేందుకు వార్డు ఆఫీసర్లు కృషి చేయాలని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ అధికారులు, ఉద్యోగులతో పాటు వార్డు ఆఫీసర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డుల్లో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికుల పనితీరుపై ఎమ్మెల్యే ఆరా తీశారు. తాండూరు మున్సిపాలిటీలో పారిశుద్ధ్యం అధ్వానంగా కనిపిస్తుందన్నారు. తాను ఏ వార్డుకు వెళ్లినా పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయని అసహనం వ్యక్తం చేశారు. వార్డుల్లో ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం వార్డు ఆఫీసర్లను నియమించిందని గుర్తు చేశారు. ఈ విషయంలో అధికారులు తమ పని తీరు మార్చుకోవాలన్నారు. తాగునీటి సరఫరా విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. వేసవిలో ఏ వార్డులో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపల్ అధికారులు, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనుల్లో నిర్లక్ష్యం తగదు

ఎంపీడీఓ గ్యామా



మాట్లాడుతున్న ఎంపీడీఓ గ్యామా

దోమ: ఉపాధిహామీ పనుల్లో నిర్లక్ష్యం తగదని ఎంపీడీఓ గ్యామా పేర్కొన్నారు. బుధవారం దోమ మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్‌అసిస్టెంట్‌లకు ఇన్‌చార్జి ఎంపీఓ రాజేశ్, ఏపీఓ దస్తయ్యతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గ్రామాల్లో ఉపాధిహామీ పనుల్లో సిబ్బంది ఎలాంటి నిర్లక్ష్యానికి గురికావొద్దన్నారు. ఉన్నతాధికారులు సూచించిన పనులను కూలీలతో సమర్థవంతంగా నిర్వహింపజేయాలన్నారు. మస్టర్లలో ఎలాంటి తప్పులు లేకుండా వచ్చిన కూలీల హాజరు మాత్రమే వేయాలన్నారు. కొంత మంది ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు కూలీలతో కుమ్మక్కై పనులకు రానీ వారి హాజరు వేస్తూ వారినుంచి డబ్బులను తీసుకుంటున్నట్లు సమాచారం. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇళ్ల నిర్మాణాల అడ్డగింత బాధాకరం

పరిగి: తుంకల్‌గడ్డలో పేదలు ఇళ్లు నిర్మించుకుంటుంటే మున్సిపల్ అధికారులు అడ్డుకోవడం బాధాకరమని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య పేర్కొన్నారు. తుంకల్‌గడ్డలో ఇళ్ల నిర్మాణాలను అడ్డుకోవడంపై నిరసిస్తూ బుధవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలను కేటాయించిందన్నారు. అందులోనే ఇళ్లను నిర్మించుకుంటుంటే తహసీల్దార్, మున్సిల్ అధికారులు అడ్డుకోవడం దుర్మార్గమన్నారు.